## బాలసదనాన్ని సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి



బాలసదనంలో విద్యార్థినితో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప

పరిగి, డిసెంబర్ 28 : పరిగి పట్టణంలోని బాలసదనాన్ని పరిగి జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. చలికాలం కావడంతో దుప్పట్లు ఉన్నాయా అని అడిగారు. బాలసదన్‌లో ఉన్న వసతులు, సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వాటిపై నివేదికను పంపిస్తానని జడ్జి తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ గౌస్‌పాషా, కోర్టు సిబ్బంది మోహన్, బాలసదన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ



దామర్‌చేడ్ గ్రామస్తులతో ఎస్సై శంకర్

బషీరాబాద్, డిసెంబర్ 28 : ప్రజల సహకారంతోనే గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షిస్తామని బషీరాబాద్ ఎస్సై శంకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అల్లాపూర్, వాల్యానాయక్‌తండా, దామర్‌చేడ్, కొత్లాపూర్, నంధ్యానాయక్‌తండా, జమ్లానాయక్ తండాలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో యువకులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలను నడుప వద్దని సూచించారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, యువకులు ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో పోస్టుమన్ మృతి



అంజిలయ్య (ఫైల్)

తాండూరు రూరల్/యాలాల, డిసెంబర్ 28: అనుమానాస్పద స్థితిలో పోస్టుమన్ మృతి చెందిన ఘటన తాండూరు రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి గ్రామానికి చెందిన అంజిలయ్య (52) పోస్టుమన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం పింఛన్ల పంపిణీ డబ్బులు డ్రా చేసి, ఇంట్లో సెల్‌ఫోన్ పెట్టి బయటకు వెళ్లాడు. నారాయణపూర్ గేటు వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తాండూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడు అంజిలప్పగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా దవాఖానకు తరలించారు. అంజిలప్ప మృతిపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి భార్య సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# యువత ఆదర్శంగా నిలవాలి

- ఎంపీడీవో మహేశ్‌బాబు
- దోమలో బాల, బాలికలకు పలు రకాల పోటీల నిర్వహణ
- విజేతలకు బహుమతులు అందజేత



దోమలో వాలీబాల్ బహుమతిని అందుకుంటున్న అయినాపూర్ శివాజీ సేన యూత్ యువకులు

దోమ, డిసెంబర్ 28 : యువత క్రీడలపై ఆసక్తి చూపుతూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఎంపీడీవో మహేశ్‌బాబు, జిల్లా యూత్ అధికారి ఐజయ్య అన్నారు. నెహ్రూ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శనివారం దోమ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 15 నుంచి 25 ఏండ్లలోపు వారికి వాలీబాల్ (బాలురు), కబడ్డీ (బాలికలు), బ్యాడ్మింటన్ వంద మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలను వారు ప్రారంభించారు. వాలీబాల్ క్రీడలో శివాజీ సేన యూత్ అసోషియేషన్ అయినాపూర్ గ్రామ యువకులు మొదటి బహుమతి గెలుపొందారు. రెండవ బహుమతి దోమ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. కబడ్డీలో మొదటి బహుమతి దోమ కేజీబీవీ పాఠశాల, రెండో బహుమతి దోమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కైవసం చేసుకున్నారు. బ్యాడ్మింటన్‌లో శిరీష, వెంకటలక్ష్మి మొదటి బహుమతి, రెండో బహుమతిని పి.శిరీశ, నందిని గెలుపొందారు. బాలికల వంద మీటర్ల పరుగులోమొదటి బహుమతి కీర్తన, రెండో బహుమతి రజిత, బాలుర విభాగంలో నితిన్, తిరుపతి గెలుపొందారు. విజేతలను అధికారులు అభినందించి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాములు, కళాశాల అధ్యాపకుడు సురేశ్, ఫిజికల్ డైరెక్టర్లు సత్యయ్య, కృష్ణమూర్తి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సహకరించాలి

**దోమ :** ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు లబ్ధిదారులు సకాలంలో అందుబాటులో ఉండి సహకరించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. శనివారం దోమ మం డల కేంద్రంలో ఆయన ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 10 రోజుల నుంచి ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నదని తెలిపారు. ఈ నెల 31 నాటికి ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి కానున్న సందర్భంగా అన్ని గ్రామాల్లోని లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని సూచించారు. సర్వే సిబ్బందికి ఆధార్, రేషన్ కార్డుల వివరాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రమట్టిని తరలిస్తున్న వాహనాల పట్టివేత



ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

వికారాబాద్, డిసెంబర్ 28 : ఎర్రమట్టిని అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకొని సీజ్ చేశామని టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దన్నారం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నిరు. రెండు లారీలు, ఒక టిప్పర్, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏడు గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### గురుకులాల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష

పరిగి, డిసెంబర్ 28 : గురుకులాల్లో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని పరిగి సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ థామస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష, 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్షను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రూ.100 రుసుం చెల్లించి 2025 ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

### బోధనకు నోచుకోని విద్యార్థినులు

పెద్దేముల్, డిసెంబర్, 28: ప్రభుత్వ మొండివైఖరితో పేద విద్యార్థినులకు బోధన అందడం లేదు. పెద్దేముల్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామంలోని కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలోని పేద విద్యార్థినులకు పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. వందల మంది విద్యార్థినులకు ఒకే ఉపాధ్యాయురాలు ఉంది. మిగతా ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో ఈ సమస్య తలెత్తింది. ఈ విధానాలతో పేద విద్యార్థులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సతమతమవుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని విద్యార్థినులకు సక్రమంగా బోధన అందించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ధారూరు పోలీస్ స్టేషన్ లో పలు రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ధారూరు, డిసెంబర్ 28 : మండల పరిధిలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శనివారం ధారూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు.పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా సిబ్బంది గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ధారూరు సీఐ రఘురాం, ఎస్సై వేణుగోపాల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు



కులకచర్లలో ఇటుక బట్టీలను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

కులకచర్ల, డిసెంబర్ 28 : బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని పరిగి సీఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని ఇటుక బట్టీలను పరిశీలించారు. బట్టీల యజమానులతో మాట్లాడారు. 18 ఏండ్లలోపు వారిని పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇటుక బట్టీల నిర్వాహకులు తమ దగ్గర ఉన్న పిల్లలను చదివించేందుకు కృషి చేయాలన్నారు. మండల విద్యాశాఖ ద్వారా విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్నపిల్లలతో పని చేయించడం చట్ట ప్రకారం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అన్వేశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, ఇటుక బట్టీల నిర్వాహకులు పాల్గొన్నారు.

## వ్యర్థాల వేలం.. రికార్డు ఆదాయం



వేలం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి

తాండూరు,డిసెంబర్ 28 : తాండూరు మున్సిపల్ కార్యాలయంలో మటన్, చికెన్ వ్యర్థాల సేకరణ కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో రికార్డు ఆదాయం లభించింది. శనివారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి సమక్షంలో మటన్, చికెన్ వ్యర్థాల సేకరణ కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో బిడ్కర్ రఘు, ఎజాజ్, అఫ్జల్, హైమద్ పాల్గొన్నారు. అఫ్జల్ రూ.12 లక్షల 55 వేలు పాడి దక్కించుకొన్నారు. వేలం దక్కించుకొన్న వ్యక్తికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏఆర్ ఫిష్ ప్రొడక్ట్ ద్వారా ఏజన్సీని అందజేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. వారంలో వేలం డబ్బులు చెల్లించకుంటే ఆ డబ్బులకు సమానంగా స్థిరాస్తిని మార్టిగేట్ చేసుకోవడంతో పాటు రెండో స్థానంలో నిలిచిన వ్యక్తికి షరతులతో ఏజన్సీని అందజేస్తామన్నారు.

# తల్లీబిడ్డ హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 28 : తల్లీబిడ్డను చంపిన కేసులో ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ రంగారెడ్డి అడిషనల్ జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. చేవెళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతల్‌కు చెందిన అలవేలుకు, కండ్లపల్లి గ్రామానికి చెందిన చేవెళ్ల శ్రీనివాస్‌తో 2007లో వివాహం జరిగింది. ఆమె పొలం పక్కనే ఉండే చేవెళ్ల కుమార్‌తో వివాహేతర సంబంధం పెట్టుకొని.. 2010లో ఆయనను తీసుకొని హైదాబాద్‌లోని బోరబండకు వెళ్లి కాపురం పెట్టింది. ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వీరిద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ఆమె కుమార్ తోనే ఉంటానని చెప్పడంతో గ్రామ పెద్దలు రూ.50 వేలు జరిమానా విధించి మళ్లీ ఊరిలో అడుగు పెట్టొద్దని హెచ్చరించారు. ఆ తర్వాత వీరు పెళ్లి చేసుకోగా.. వీరికి కూతురు పుట్టింది. ఈ సమయంలో వీరు మొయినాబాద్ మండలం ముర్తుజాగూడలోని రత్న కుమారి గార్డెన్లో పనిచేస్తున్నారు. అయితే అలివేలు ఇతరులతో మాట్లాడుతున్నదని కుమార్ అనుమానం పెంచుకొని వేధించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో ఆమె మరోసారి గర్భం దాల్చడంతో అబార్షన్ చేసుకోవాలని ఒత్తిడి పెంచాడు. ఆమె వినకపోవడంతో తన స్నేహితులైన కండ్లపల్లి గ్రామానికి చెందిన చేవెళ్ల రాజన్న, చేవెళ్ల సాయన్న, మేకల రాజు అలియాస్ వెంకటేశ్, మైలారం శ్రీశైలంతో కలిసి అలివేలును చంపాలని ప్లాన్ వేశాడు. ఈ మేరకు 2012 మే 7న ర్యాకంచర్లలోని తిరుమలనాథ ఆలయానికి వెళ్దామని చెప్పి ఆటోలో బయల్దేరారు. మార్గ మధ్యలో పెట్రోల్ బంక్ వద్ద బాటిళ్లలో పెట్రోల్ పోయించుకొని చేవెళ్ల మండలం ఆలూరు సమీపంలోని ఓ పొలంలోకి తీసుకెళ్లారు. అనుమానం వచ్చిన అలివేలు పారిపోయేందుకు ప్రయత్నించగా.. వెంబడించి పట్టుకొని కత్తితో గొంతు కోసి చంపేశారు. పాపను కూడా గొంతు నులిమి ఆమెతో పాటు చెరుకు కట్టెల్లో చుట్టి పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. అక్కడి నుంచి బీర్లు తీసుకొని తిరిగి ఫామ్ హౌజ్‌కు వెళ్లిపోయారు. సెక్యూరిటీ గార్డులు అలివేలు గురించి ఆరా తీయగా.. తెల్లారి వెళ్లి పోలీసులకు మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చాడు. పొలం యజమాని తోట ఆగమయ్య గ్రామ కార్యదర్శికి విషయం చెప్పగా.. ఆయన ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి పోలీసులకు రిపోర్ట్ ఇచ్చాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు 2013 ఏప్రిల్ 25న చార్జిషీటు దాఖలు చేసి ఎల్బీనగర్‌లోని పదో అడిషనల్ జిల్లా కోర్టుకు సమర్పించారు. విచారణ చేపట్టిన జడ్జి జయలక్ష్మి సాక్ష్యాధారాలు పరిశీలించి శుక్రవారం ముగ్గురికి (మరో నిందితుడు మైలారం శ్రీనివాస్ 2020లో చనిపోయాడు)కు జీవిత ఖైదుతో పాటు రూ.40 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ జరిమానా అమౌంట్ బాధిత కుటుంబ సభ్యులకు పరిహారంగా అందించాలని సూచించారు.

**డబ్బుల కోసం వ్యక్తిని చంపిన ఇద్దరికీ జీవిత ఖైదు**

డబ్బుల కోసం వ్యక్తిని హత్య చేసిన ఇద్దరికి రంగారెడ్డి జిల్లా అడిషనల్ కోర్టు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.10వేల చొప్పున జరిమానా విధించింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం రేగడి ఘనపురానికి చెందిన గూడురు కుమార్ అలియాస్ కొమురయ్య వ్యవసాయం చేస్తూ, కుర్వ రామచంద్రయ్య గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. వీళ్లు ఖానాపూర్ గ్రామానికి చెందిన పంబలి శ్రీరాములు(60)పై 2015 అక్టోబర్ 22న రాత్రిపూట దాడి చేసి రూ.11 వేలు దోచుకున్నారు. ఈ క్రమంలో బాధితుడి ప్రైవేటు భాగాలను గాయపరచడంతో తీవ్ర రక్తస్రావం కాగా.. కుటుంబ సభ్యులు గమనించి చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాధారాలు సేకరించి 2016 ఫిబ్రవరి 16న చార్జిషీటు ఫైల్ చేసి ఎల్బీనగర్లోని పదో అడిషనల్ జిల్లా కోర్టుకు సమర్పించారు. విచారణ చేపట్టిన జడ్జి జయలక్ష్మి శుక్రవారం ఇద్దరికి జీవిత ఖైదు, రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

## అనుమతులు లేని రిసార్ట్‌లకు నోటీసులు



టిక్కి విలేజ్ రిసార్ట్‌కు నోటీసులు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి

వికారాబాద్, డిసెంబర్ 28 : గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతులు లేని రిసార్ట్‌లకు శనివారం పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. వికారాబాద్ మండల పరిధిలోని గోదుమగూడ గ్రామ పంచాయతీ పరిధిలో టిక్కి విలేజ్‌తో పాటు మరి కొన్ని రిసార్ట్‌లకు పంచాయతీ కార్యదర్శి స్వాతి నోటీసులు అందజేశారు. గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా గుడారాలు, నిర్మాణ పనులు, ఆన్‌లైన్ బుకింగ్, అక్కడ జరిగే కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. మరో రెండు రోజుల్లో కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు రిసార్ట్స్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అనుమతులు తీసుకొనే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. లేనిపక్షంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 114(1) ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి కవిత


కులకచర్ల, డిసెంబర్ 28 : ప్లాస్టిక్ రహిత స మాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని పుట్టపహాడ్ పంచాయతీ కార్యదర్శి కవిత, జీవ మిత్ర ఆర్గనైజేషన్ నిర్వాహకులు సాయిభరత్, ఉత్తమ్‌కుమార్ అన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### శంషాబాద్‌లో 171 కేసులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 28: శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 171 కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సుంకం చెల్లించని మద్యం(ఎన్‌డీపీఎల్) కేసులు 21, దీంతోపాటు గంజాయి నార్కోటిక్(ఎన్‌డీపీఎస్) డ్రగ్స్ కేసులు 36 నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో 114 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలకు డ్రగ్స్, సుంకం చెల్లించని మద్యాన్ని వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు ఉంటాయన్నారు. డిసెంబర్ 31వ తేదీన వేడుకలకు చేసుకునేందుకు ఫంక్షన్‌హాల్స్, కన్వెన్షన్‌హాల్స్, ఫాంహౌజ్‌లకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. లేనిచో చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

## ఒడిశా నుంచి మహారాష్ట్రకు
# రైల్లో గంజాయి సరఫరా

- అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు.. గంజాయి స్వాధీనం
- పరారీలో ప్రధాన నిందితుడు
- వివరాలు వెల్లడించిన రైల్వే డీఎస్పీ జావెద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావెద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్

మారేడ్‌పల్లి, డిసెంబర్ 28: ఒడిశాలోని కోరాపుట్ నుంచి మహారాష్ట్రకు రైల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఓ అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్‌తో కలిసి రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావెద్ కేసు వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బందా జిల్లా, బరగావ్ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్(28), దీపక్ కుమార్(22) మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో ఓ గదిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటూ.. ప్లాస్టిక్ బాటిల్స్ సేకరణ ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. అయితే మహారాష్ట్ర రత్నగిరి ప్రాంతానికి చెందిన మోహిత్ అనే వ్యక్తి గంజాయి అమ్మడం ద్వారా అధిక డబ్బులు సంపాదిస్తున్నాడని నిందితులు తెలుసుకొని ప్రధాన నిందితుడు అయిన మోహిత్‌ను కలిసి గంజాయిని రవాణా చేయడానికి అనుమతి కోసం అభ్యర్థించారు. ఇదే అదునుగా భావించిన మోహిత్ ఒడిశా నుంచి కళ్యాణ్ వరకు రైల్లో గంజాయిని తరలిస్తే.. రూ.1500 ఇస్తానని అరుణ్‌కుమార్, దీపక్‌లకు ఆశ చూపాడు. ఇందుకు వీరిద్దరూ అంగీకరించి.. ఈనెల 25వ తేదీన ప్రధాన నిందితుడు అయిన మోహిత్‌తో కలిసి నిందితులిద్దరూ కోరాపుట్ అటవీ ప్రాంతానికి వెళ్లి అక్కడ 10 కిలోల ఎండు గంజాయిని రూ.20వేలకు కొనుగోలు చేశారు. అనంతరం ఈనెల 26వ తేదీన కోరాపుట్ నుంచి విశాఖపట్నంకు అందరూ కలిసి చేరుకున్నారు.

**ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైల్లో అక్రమ రవాణా..**

ఈనెల 26వ తేదీన ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ కోచ్‌లలో నిందితులు అరుణ్‌కుమార్, దీపక్‌లు ఎండు గంజాయిని అక్రమంగా మహారాష్ట్రకు సరఫరా చేస్తున్నారు. తనకు చిన్న చిన్న పనులు ఉన్నాయని, నేను మహారాష్ట్రలోని కల్యాణి ప్రాంతంలో మిమ్మల్ని కలుస్తానని ప్రధాన నిందితుడు మోహిత్ నిందితులిద్దరికి చెప్పారు. ఇందులో భాగంగా రైలు ఈనెల 27వ తేదీన 2:15 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫారం నంబర్ 2కు చేరుకున్నది. నిందితులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగిన అనంతరం మరో రైల్లో మహారాష్ట్రకు వెళ్లాల్సి ఉన్నది. కాగా, ఈ సమయంలో రైల్వే ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ప్లాట్ ఫాంలను తనిఖీలు చేస్తుండగా.. నిందితులిద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్ద ఉన్న బ్యాగ్‌లను చెక్ చేయగా.. అందులో గంజాయి ఉందని గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. చేసిన నేరాన్ని అంగీకరించారు. నిందితుల వద్ద నుంచి 10.143 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితులు మోహిత్ పరారీలో ఉన్నాడు. ఈ మీడియా సమావేశంలో ఎస్ఐ మజీద్, రైల్వే సిబ్బంది భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962